# అధ్యాయం 3 ఆర్థిక విషయాల నివేదన

## 3.1 పరిచయం

పటిష్టమైన అంతర్గత నియంత్రణలు కలిగి ఉండడం, నియమాలనూ, పద్ధతులనూ పాటించడం సుపరిపాలనకు ప్రముఖంగా తోడ్పడతాయి. తగిన సమాచారంతో కూడిన, విశ్వసనీయమైన, సత్వర ఆర్థిక విషయాల నివేదన జరిగేలా భరోసానివ్వడం ద్వారా, రాష్ట్ర ప్రభుత్వం తన మౌలిక కార్యనిర్వాహక బాధ్యతలను నిర్వర్తించడంతో పాటు, వ్యూహాత్మక ప్రణాళికా రచనలోనూ, తగు నిర్ణయాలను తీసుకోవడంలోనూ కూడా ఇవి సహాయపడతాయి. వివిధ ఆర్థిక నియమాలు, పద్ధతులు, నిర్దేశాలను పాటించడంలో ప్రభుత్వపు ప్రస్తుత సంవత్సర స్థితిగతులను స్థూలంగా ఈ అధ్యాయంలో తెలియజేయడమైనది.

## 3.2 వివరణాత్మక కంటింజంట్ బిల్లుల బకాయిలు

ప్రభుత్వ[1] ఆదేశాలననుసరించి సంక్షిప్త ఆకస్మిక (ఎ.సి.) బిల్లులపై పొందిన మొత్తాలతో చేసిన ఖర్చులకు వివరాణాత్మక ఆకస్మిక (డి.సి.) బిల్లులను, ఓచర్లతో సహా, ఒక నెలలోపు ప్రధాన మహాగణకులు (ఎ&ఇ)/పి.ఎ.ఓ.కి సమర్పించి, పరిష్కరించాలి. ఐతే, ఈ విషయాన్ని ప్రధాన మహా గణకులు ప్రభుత్వ దృష్టికి అనేక పర్యాయములు తీసుకువచ్చినప్పటికీ, 2011 మార్చి 31 నాటికి ₹ 2,359 కోట్ల విలువైన ఎ.సి.బిల్లులకు గాను ₹ 1,115 కోట్ల (47 శాతం) విలువైన డి.సి. బిల్లులు మాత్రమే సమర్పించడం జరిగింది. సంవత్సర వారీ వివరాలు **పట్టిక 3.1** లో ఇవ్వడం జరిగింది.

**పట్టిక 3.1 : ఎ.సి. బిల్లులపై పొందిన సొమ్ము**

**(₹ కోట్లలో)**

| సంవత్సరం | డ్రా చేసిన ఎ.సి.బిల్లులు | | సమర్పించిన డి.సి.బిల్లులు | | సర్దుబాటైన సొమ్ము శాతంలో | బకాయిలో ఉన్న డి.సి.బిల్లులు | |
|---|---|---|---|---|---|---|---|
| | సంఖ్య | సొమ్ము మొత్తం | సంఖ్య | సొమ్ము మొత్తం | | సంఖ్య | సొమ్ము మొత్తం |
| 2005-06 వరకు | 67,932 | 452 | 43,466 | 287 | 63 | 1,06,596* | 387* |
| 2006-07 | 13,252 | 233 | 10,460 | 147 | 63 | 2,793 | 86 |
| 2007-08 | 10,710 | 169 | 7,873 | 131 | 78 | 2,837 | 38 |
| 2008-09 | 7,805 | 187 | 5,247 | 97 | 52 | 2,558 | 90 |
| 2009-10 | 4,871 | 505 | 3,386 | 310 | 61 | 1,485 | 195 |
| 2010-11 | 3,366 | 813 | 1,505 | 143 | 18 | 1,862 | 670 |
| మొత్తం | 1,07,936 | 2,359 | 71,937 | 1,115 | 47 | 1,18,131 | 1,466 |

* 2002-03 సంవత్సరం వరకు డ్రా చేసిన ₹ 222 కోట్ల విలువైన 82,130 ఎ.సి.బిల్లులతో కలిపి (వీటి వివరాలు అందుబాటులో లేవు).

ఎ.సి. బిల్లులపై సొమ్ము పొంది, అపరిష్కృతంగా ఉన్న వాటిలో సుమారు 76 శాతం (₹ 1,107 కోట్లు), వ్యవసాయం (₹ 692 కోట్లు) మరియు రెవెన్యూ (₹ 415 కోట్లు) శాఖలకు చెందినవే. 2011 మార్చి 31 నాటికి బకాయిల్లో ఉన్న డి.సి. బిల్లుల వివరాలు శాఖల వారీగా ***అనుబంధం 3.1***లో ఉన్నాయి.

## 3.3 వినియోగ ధృవపత్రాలను సమర్పించడంలో జాప్యం

ఏదైనా నిర్దిష్ట ప్రయోజనాల కోసం ఇచ్చిన గ్రాంట్ల విషయంలో సంబంధిత శాఖాధికారులు ఆయా గ్రాంట్లను పొందిన సంస్థల నుండి వినియోగ ధృవ పత్రాలను (యూ.సి.లు) తెప్పించుకొని, వాటిని పరిశీలించి గ్రాంట్లు మంజూరైన తేదీ నుండి 18 నెలల్లోగా (మరోలా నిర్దేశిస్తే తప్ప) వాటిని ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్‌కు సమర్పించాలని ఆర్థిక నియమాలు[2] నిర్దేశిస్తున్నాయి. ఐతే, 1992-2011 మధ్యకాలంలో చెల్లించిన ₹ 31 కోట్ల రూపాయల గ్రాంట్లకు సంబంధించిన 269 యూ.సి.లు 11 నుండి 18 సంవత్సరాలుగా బకాయిల్లో ఉన్నాయి (2011 మార్చి 31 నాటికి).

---

[1] జి.ఓ.ఎమ్.ఎస్.నెం.285, ఆర్థిక (టి.ఎఫ్.ఆర్.-II) శాఖ, తేదీ 15-10-2005

[2] ఆంధ్రప్రదేశ్ ఫైనాన్షియల్ కోడ్‌లోని అధికరణం 211-ఎ(2) కింది నోట్

## 3.4 స్వయంపాలక సంస్థల పద్దులు/ఆడిట్ నివేదికల సమర్పణ

వైద్య విద్య, గిరిజన సంక్షేమం, గ్రామీణ మరియు పట్టణాభివృద్ధి మొదలైన రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వం పలు స్వయంపాలక సంస్థలను ఏర్పరిచింది. రాష్ట్రంలో ఇలాంటి సంస్థల్లో 20 సంస్థల పద్దుల తనిఖీ భారత కంప్ట్రోలర్ - ఆడిటర్ జనరల్ (సి.ఏ.జి.) కి అప్పగించడం జరిగింది. ఐతే, 2010-11 నాటికి వార్షిక పద్దుల సమర్పణ విషయంలో, మొత్తం 20 సంస్థలూ బకాయిఉన్నాయి. తనిఖీ కొరకు పద్దులను సమర్పించడంలో జరిగిన జాప్యం 3 నెలల నుండి 87 నెలల వరకూ ఉంది. సమర్పించిన, సమర్పించాల్సిన పద్దుల వివరాలు ***అనుబంధం 3.2*** లో ఉన్నాయి.

ఆర్థిక పరమైన అవకతవకలు ఏమైనా జరిగి ఉంటే వాటిని గుర్తించుటకుగాను నిర్దిష్ట కాలపరిమితిలో పద్దులను సంకలనము చేసి తనిఖీకి సమర్పించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టవలసిన అవసరం ఎంతైనా ఉంది.

## 3.5 శాఖాపరమైన వాణిజ్య సంస్థలు

ప్రభుత్వ శాఖల కింద పాక్షిక-వాణిజ్య కార్యకలాపాలను సాగించే సంస్థలు తమ ఆర్థిక కార్యకలాపాల ఫలితాలను తెలుపుతూ నిర్దేశిత నమూనాలో ప్రతి ఏటా ప్రొఫార్మా పద్దులను తయారుచేయాలి. వీటి ఆధారంగా ప్రభుత్వం ఆ సంస్థల పనితీరుని అంచనా వేయగలుగుతుంది. పద్దులను సకాలంలో ఖరారు చేయకపోతే ప్రభుత్వ పెట్టుబడులు ఆడిట్/రాష్ట్ర శాసన సభ పరిశీలనకు నోచుకోవు. పర్యవసానంగా సంస్థల జవాబుదారీతనాన్ని, కార్యదక్షతను మెరుగుపరిచేందుకు తీసుకోవలసిన దిద్దుబాటు చర్యలను సకాలంలో తీసుకునే వీలుండదు. పైగా, ఈ జాప్యాల వలన ప్రజాధనం దుర్వినియోగం, మోసాలు జరిగే ప్రమాదం కూడా లేకపోలేదు. ఈ జాప్యం సంస్థల కార్యకలాపాల పారదర్శకతను కూడా ప్రభావితం చేస్తుంది.

ఈ సంస్థల పద్దులను తయారుచేసి, ఆడిట్ నిమిత్తం వాటిని నిర్దేశిత గడువులోగా అకౌంటెంట్ జనరల్‌కు సమర్పించేలా ప్రభుత్వంలోని సంబంధిత శాఖాధిపతులు చూడాలి. 2011 మార్చి 31 నాటికి, తొమ్మిది సంస్థలలో ఏడు సంస్థల పద్దులు ఒకటి నుండి 46 సంవత్సరాలు బకాయిల్లో ఉన్నాయి. వీటిలో చేపపిల్లల ఉత్పత్తి కేంద్రం, తుంగభద్ర ఆనకట్ట కు సంబంధించిన పద్దులు 1963-64 సంవత్సరం నుండి బకాయిల్లో ఉన్నాయి. ఐదు సంస్థలకు[3] సంబంధించిన పెట్టుబడి, ఆస్తులు, వ్యాపార మొత్తం మొదలైన వివరాలు కనీసం సంబంధిత ప్రభుత్వశాఖల వద్ద కూడా లేవు. ఇది రాష్ట్ర ప్రభుత్వ శాఖలలోని బలహీనమైన అంతర్గత నియంత్రణ వ్యవస్థను ప్రతిబింబిస్తుంది.

పద్దుల తయారీలోని బకాయిలపై ఆడిట్ నివేదికలలో సి.ఏ.జి. పదే పదే ఆందోళన వ్యక్తం చేసారు. అయినా, ఈ సంస్థల ప్రొఫార్మా పద్దుల తయారీలో ఇంతవరకూ ఎలాంటి పురోగతీ లేదు. శాఖల వారీగా ప్రొఫార్మా పద్దుల తయారీలో పేరుకు పోయిన బకాయిల పరిస్థితిని, ఆయా సంస్థల్లో ప్రభుత్వం పెట్టిన పెట్టుబడుల వివరాలను ***అనుబంధం 3.3*** లో ఇవ్వడమైంది.

## 3.6 రికన్సిలియేషన్ చేయని ఖర్చులు, రాబడులు

ఖర్చును బడ్జెట్ గ్రాంట్ల పరిధిలో ఉంచుతూ, వాటి పద్దుల ఖచ్చితత్వానికి భరోసాయిస్తూ, ప్రభావవంతంగా నియంత్రించుటకు గాను వివిధ శాఖల నియంత్రణాధికారులను సమాయత్తం చేయడానికి వారి పుస్తకాలలో, ఆ ఆర్థిక సంవత్సరంలో నమోదైన నెలవారీ ఖర్చును అకౌంట్స్ & ఎంటైటిల్‌మెంట్స్ - ప్రధాన మహా గణకుని పుస్తకాలలోని ఖర్చుతో సరిపోల్చుకోవాలని ఆర్థిక నియమాలు[4] నిర్దేశిస్తున్నాయి. ప్రభుత్వ శాఖలు తమ పద్దులను సరిపోల్చుకోకపోవడాన్ని ఆడిట్ రిపోర్టులలో పదేపదే ఎత్తిచూపినప్పటికీ, ఈ విషయంలో నియంత్రణాధికారుల లోపాలు 2010-11 సంవత్సరంలో కూడా కొనసాగాయి. 2010-11 లో అయిన మొత్తం ఖర్చు[5] ₹ 92,972 కోట్లకుగాను, ₹ 14,789 కోట్లను (16 శాతం) 260 మంది నియంత్రణాధికారులు 2011 జూన్ నాటికి రికన్సయిల్ చేయలేదు. తొమ్మిది మంది నియంత్రణాధికారులకు సంబంధించి ప్రతీ కేసులోనూ ₹ 500 కోట్లు మరియు అంతకు మించి రికన్సయిల్ చేయని ఖర్చు వివరాలు **పట్టిక 3.2** లో ఉన్నాయి.

---

[3] ప్రభుత్వ కేంద్రీయ ముద్రణాలయం, హైదరాబాదు; ప్రభుత్వ ప్రాంతీయ ముద్రణాలయం, కర్నూలు; ప్రభుత్వ ప్రాంతీయ ముద్రణాలయం, విజయవాడ, ప్రభుత్వ డిస్టిలరీ, హైదరాబాదు మరియు చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం, తుంగభద్ర ఆనకట్ట

[4] ఆంధ్రప్రదేశ్ ఫైనాన్షియల్ కోడ్‌లోని అధికరణం 9

[5] రెవెన్యూ, క్యాపిటల్ మరియు లోనులు మరియు అడ్వాన్సులతో కలిపి

పట్టిక 3.2 : రికన్సయిల్ చేయని ఖర్చు

(₹ కోట్లలో)

| క్రమ సంఖ్య | శాఖ/నియంత్రణాధికారి | రికన్సయిల్ కాని మొత్తం |
|---|---|---|
| 1 | ఆర్థిక (ఎమ్.హెచ్. 2049 - వడ్డీ చెల్లింపులు) | 1,066 |
| 2 | భూ పరిపాలన (ఎమ్.హెచ్. 2053 - జిల్లా యంత్రాంగం) | 729 |
| 3 | పోలీసు డైరెక్టర్ జనరల్ మరియు ఇనస్పెక్టర్ జనరల్ (ఎమ్.హెచ్. 2055 - పోలీసు) | 2,644 |
| 4 | ఉన్నత విద్య, సచివాలయ శాఖ (ఎమ్.హెచ్. 2202 - సాధారణ విద్య) | 544 |
| 5 | వైద్య విద్య (ఎమ్.హెచ్. 2210 - వైద్యం, ప్రజారోగ్యం) | 506 |
| 6 | పంచాయతీ రాజ్ (ఎమ్.హెచ్. 2515 - ఇతర గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు) | 1,039 |
| 7 | మున్సిపల్ పరిపాలన మరియు పట్టణాభివృద్ధి, సచివాలయ శాఖ (ఎమ్.హెచ్. 6215 - నీటి సరఫరా మరియు పారిశుధ్యం కొరకు రుణాలు) | 500 |
| 8 | పోలీసు డైరెక్టర్ జనరల్ మరియు ఇనస్పెక్టర్ జనరల్ (ఎమ్.హెచ్. 6216 - గృహ నిర్మాణానికి రుణాలు) | 911 |
| 9 | మున్సిపల్ పరిపాలన మరియు పట్టణాభివృద్ధి, సచివాలయ శాఖ (ఎమ్.హెచ్. 6217 - పట్టణాభివృద్ధి కొరకు రుణాలు) | 960 |

అంతేగాక, ప్రతీ నియంత్రణాధికారి , కింది అధికారులనుండి వారు పొందిన సొమ్ముకు, ఖజానాలో జమచేసిన సొమ్ముకు సంబంధించిన పద్దులను మరియు నివేదికలను క్రమం తప్పకుండా తెప్పించుకొని ప్రధాన మహాగణకుని ఖాతాలతో సరిపోల్చుకుని ఆర్థిక సంవత్సరం ముగిసే లోపు వీలైనంత త్వరగా లెక్కలలో తేడాలను రికన్సయిల్ చేసుకొనవలెను. అయినప్పటికీ 2010-11 సంవత్సరంలో 49 పద్దుల కింద ₹ 52,569 కోట్ల (మొత్తం రాబడులలో 65 శాతం) రాబడులను[6] సంబంధిత నియంత్రణాధికారులు రికన్సయిల్ చేయలేదు.

## 3.7 నిధుల దుర్వినియోగాలు, నష్టాలు, ద్రవ్యాపహరణలు వగైరా

ప్రభుత్వ ధనంతో వ్యవహరించే విషయంలో ప్రభుత్వోద్యోగుల బాధ్యతలను, ప్రభుత్వానికి ఏదైనా నష్టం వాటిల్లితే అందుకు బాధ్యుల్ని గుర్తించే పద్ధతిని, నష్టాన్ని రాబట్టుకోవడంలో అనుసరించాల్సిన పద్ధతిని, తీసుకోవాల్సిన చర్యలను ఆర్థిక నియమాలు[7] నిర్దేశిస్తున్నాయి.

2011 ఏప్రిల్ నాటికి ₹ 35 కోట్ల ప్రభుత్వ ధనానికి సంబంధించిన 472 నిధుల దుర్వినియోగం, ద్రవ్యాపహరణ వగైరా కేసులున్నాయనీ, వాటిపై అంతిమ చర్యలు పెండింగులో ఉన్నాయనీ రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. శాఖల వారీగా బకాయిల్లో ఉన్న కేసుల వివరాలను, సంవత్సర వారీ విశ్లేషణను ***అనుబంధం-3.4***లో ఇవ్వడమైనది. సాంఘిక సంక్షేమ శాఖలో (గిరిజన సంక్షేమశాఖతో కలిపి) 26 కేసుల్లో అత్యధిక మొత్తంలో ₹ 24 కోట్ల నిధుల దుర్వినియోగం జరిగింది. సంఖ్యాపరంగా చూస్తే రెవెన్యూ శాఖలో అత్యధికంగా 260 నిధుల దుర్వినియోగ కేసులు (మొత్తం కోటి రూపాయలకు సంబంధించి) పెండింగులో ఉన్నాయి.

## 3.8 ఓమ్ని బస్ - చిన్న పద్దు 800 నిర్వహణ

గత రెండు దశాబ్దాల కాలంలో, ప్రభుత్వ కార్యకలాపాల పరిధి బహుముఖంగా పెరిగిపోయింది. అందువలన అందుబాటులో ఉన్న పథకాల చిన్న పద్దుల సంఖ్య కూడా మించిపోతోంది. ఉన్న చిన్న పద్దుల కింద వర్గీకరించలేని ఖర్చుకు ఓమ్నిబస్ చిన్న పద్దు - 800 లో స్థానం కల్పించడం జరుగుతోంది.

[6] రెవెన్యూ, క్యాపిటల్ మరియు లోనులు మరియు అడ్వాన్సులతో కలిపి

[7] ఆంధ్రప్రదేశ్ ఫైనాన్షియల్ కోడ్‌లోని అధికరణాలు 5, 273, 294 మరియు 300 నుండి 302 వరకు

2010-11 ఆర్థిక సంవత్సరంలో ₹ 11,046 కోట్ల (మొత్తం ఖర్చు ₹ 89,657 కోట్లలో 12 శాతం) ఖర్చును రెవెన్యూ, కేపిటల్ విభాగాలలో 44 పెద్ద పద్దుల్లో, చిన్న పద్దు 800 - ఇతర ఖర్చు కింద వర్గీకరించారు. విద్యుత్ సబ్సిడీ, బియ్యం సబ్సిడీ, రోడ్లు - వంతెనలపై క్యాపిటల్ పరివ్యయం, గ్రామీణాభివృద్ధి తాలూకు ప్రత్యేక కార్యక్రమాలు, సాధారణ ఆర్థిక సేవలు మొదలైన వాటిపై అయిన ప్రధాన వ్యయాన్ని పద్దుల్లో ప్రత్యేకంగా చూపడానికి బదులు ఓమ్నిబస్ చిన్న పద్దు - 800 కింద వర్గీకరించారు.

అలాగే ₹ 4,699 కోట్ల (మొత్తం రెవెన్యూ రాబడులు ₹ 80,996 కోట్లలో 6 శాతం) రెవెన్యూ రాబడులను 46 పెద్ద పద్దుల కింద ఓమ్నిబస్ చిన్న పద్దు '800 - ఇతర రాబడులు' కింద వర్గీకరించారు. ఇతర గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు, ఓడరేవులు, లైటుహౌసులు, పట్టణాభివృద్ధి, పౌరసరఫరాలు మొదలైన వాటి కింద వసూలైన మొత్తం పన్నుకాని రెవెన్యూను ఈ చిన్న పద్దు కింద వర్గీకరించారు.

'ఓమ్నిబస్ చిన్న పద్దు - 800 ఇతర ఖర్చు/రాబడులు' కింద భారీ మొత్తాలను వర్గీకరించి చూపడం వలన ఆర్థిక నివేదనలో పారదర్శకత లోపిస్తుంది.

## 3.9 ఖజానాల పనితీరు

ఖజానాల తనిఖీ సమయంలో, పింఛను/కుటుంబ పింఛను చెల్లింపుల విషయంలో ప్రధాన మహాగణకులు (ఎ&ఇ) గమనించిన ముఖ్యమైన అవకతవకలను కింది పేరాలో ఉదహరించడం జరిగింది.

### *3.9.1 పింఛను/కుటుంబ పింఛనుల అధిక చెల్లింపులు*

పింఛను, కుటుంబ పింఛను చెల్లింపులకు సంబంధించి 2010-11 లో మొత్తం 23 జిల్లా ట్రెజరీలు, 149 సబ్ ట్రెజరీలు, 7 సహాయ పింఛను చెల్లింపు కార్యాలయాల రికార్డులను మచ్చుకు తనిఖీ చేయగా 311 కేసుల్లో ₹ 1.39 కోట్ల మేర అధిక చెల్లింపులు జరిగినట్లు వెల్లడైంది. వివరాలు **పట్టిక 3.3** లో ఉన్నాయి :


**పట్టిక 3.3 : పింఛను, కుటుంబ పింఛనుల అధిక చెల్లింపులు**

(₹ లక్షల్లో)

| అక్రమం స్వభావం | కేసుల సంఖ్య | మొత్తం |
|---|---|---|
| కరువు సహాయం అక్రమంగా అనుమతించడం | 70 | 35 |
| అమ్ముకున్న పింఛను భాగం తగ్గించకపోవడం | 93 | 33 |
| పెంచిన కుటుంబ పింఛనును గడువు తర్వాత కూడా చెల్లించడంవలన జరిగిన అధిక చెల్లింపులు | 47 | 28 |
| అక్రమంగా ఆర్థిక సహాయం చెల్లించడం | 7 | 10 |
| సవరించిన పింఛనును తప్పుగా లెక్కించడం | 20 | 8 |
| పింఛనుదారు మరణించిన తర్వాత కూడా పింఛను ఇవ్వడం | 21 | 7 |
| గ్రాట్యుటీ పేమెంట్ ఆర్డర్ లోని రికవరీని పట్టించుకోకుండా పింఛను అధికముగా చెల్లించడం | 9 | 6 |
| కుటుంబ పింఛను తప్పుగా చెల్లించడం | 2 | 4 |
| కాలం చెల్లిన ఉత్తర్వు ఆధారంగా గ్రాట్యుటీని చెల్లించడం | 1 | 4 |
| రెండుసార్లు చెల్లింపుచేయడం/పి.పి.ఒ.మరొక చోటికి బదిలీ అయిన తర్వాత చెల్లించడం/ప్రొవిజినల్ పింఛనుకు బదులు పూర్తి పింఛను చెల్లించడం | 4 | 2 |
| అమ్ముకున్న పింఛనును తప్పుగా పునరుద్ధరించడం | 13 | 1 |
| ఆమోదయోగ్యం కాని తాత్కాలిక భృతిని చెల్లించడం | 24 | 1 |
| **మొత్తం** | **311** | **139** |

పింఛనుదారులకు చెల్లించిన అధిక మొత్తాలను జిల్లా ఖజానాలు సమాన వాయిదాలలో రికవరీ చేయడం ప్రారంభించాయి. 2010-11 సంవత్సరంలో ₹ 29 లక్షలు రికవరీ చేయడం జరిగింది.

పింఛను, ఇతర పదవీ విరమణ ప్రయోజనాలకు సంబంధించి గత ఐదు సంవత్సరాలలో అధికంగా చెల్లించిన మొత్తాల వివరాలను కింది **చార్టు 3.1** లో చూపడమైంది.




## 3.10 సారాంశం

ప్రభుత్వం జారీ చేసిన వివిధ నియమాలనూ, రూపొందించిన విధానాలనూ పాటించడంలో రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లోని అంతర్గత నియంత్రణల పనితీరు నిర్దేశించిన విధంగా లేదు. వార్షిక పద్దులను ప్రభుత్వరంగ సంస్థలు సంకలనం చేయకపోవడం, ఆకస్మిక ఖర్చుల సంక్షిప్త (ఎ.సి.) బిల్లులపై డ్రా చేసిన భారీ మొత్తాలకు ప్రభుత్వ శాఖల అధికార్లు లెక్కలు చూపకపోవడం/ వాటిని సర్దుబాటు చేయకపోవడం ఆర్థిక నివేదన కచ్చితత్వం, విశ్వసనీయతలపై ప్రభావం చూపుతుంది. భారీ మొత్తంలో రాబడులు, ఖర్చులను రీకన్సిలియేషన్ చేయనందువల్ల పద్దుల్లోని అంకెల వాస్తవికతపై సందేహాలు తలెత్తుతాయి. అంతేకాక సబ్సిడీలు, రోడ్లు వంతెనలపై క్యాపిటల్ పరివ్యయం, గ్రామీణాభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాలపై ఖర్చులు, రెవెన్యూ రాబడులు మొదలైన ముఖ్యమైన అంశాలను ఓమ్నిబస్ చిన్న పద్దు - 800 కింద వర్గీకరించడంవల్ల రాష్ట్ర ప్రభుత్వ పద్దులలో పారదర్శకత లోపిస్తోంది.

(వాణీ శ్రీరామ్)
హైదరాబాదు — మహాగణకాధికారి (సివిల్ ఆడిట్)
ఆంధ్రప్రదేశ్

ధ్రువీకరించడమైనది

(వినోద్ రాయ్)
కొత్త ఢిల్లీ — భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్